సాక్షి
సంగారెడ్డి
సోమవారం । 19 । ఆగస్టు । 2024

చిత్రం.. చెదరని జ్ఞాపకం





నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఒక్క క్లిక్‌తో ఎన్నో భావాలను బాహ్య ప్రపంచానికి తెలియజేసే అద్భుతమైన శక్తి ఒక్క ఫొటోగ్రఫీకే ఉంది. ప్రతీ క్షణాన్ని మన కళ్లెదుట చెదరని జ్ఞాపకంగా నిలిపి ఉంచేది ఫొటో మాత్రమే. కాలగర్భంలో కలిసిపోయిన చరిత్రకూ సజీవ సాక్ష్యం చిత్రమే. మాటల్లో చెప్పలేని వంద భావాలు ఒక్క ఫొటోతో పలికించగలమనేది అక్షరసత్యం. ప్రకృతి రమణీయత, జీవకోటి జీవనయానం, ఆహ్లాదకర దృశ్యాలు మనసుకు ఇట్టే అతుక్కుపోతాయి. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కొన్ని చిత్రాలు.. 8లో..

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

● సర్వాయి పాపన్న జీవితం ఆదర్శనీయం



కలెక్టరేట్‌లో పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ క్రాంతి, అధికారులు తదితరులు



సంగారెడ్డిలో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

బహుజనుల హక్కుల కోసం పోరాడిన మహా వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ క్రాంతి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో పాపన్న గౌడ్ 374 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీజీఐడీసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, డీఆర్‌ఓ పద్మజారాణి పాల్గొన్నారు.అలాగే పట్టణంలోని పాపన్న గౌడ్ విగ్రహం వద్ద కల్లుగీత కార్మిక సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ పాల్గొన్నారు.

సంగారెడ్డి జోన్/సంగారెడ్డి టౌన్ :

అనుబంధాల రాఖీ

నేడు రక్షాబంధన్



రక్షా బంధన్.. సోదరి, సోదరుల అనుబంధానికి ప్రతీక. రాఖీ.. సోదరుడిపై గల అమితమైన ప్రేమకు ఓ తీపిగుర్తు. అంతే కాదు పది కాలాల పాటు చల్లగా ఉండాలంటూ మనసారా కోరుకునే వ్యక్తి సోదరి. అంతటి విశిష్ట గల గొప్ప పండుగ రాఖీ పౌర్ణమి. ఇదిలా ఉంటే జిల్లా అంతటా పండుగ సందడి నెలకొంది. రాఖీల కొనుగోళ్లతో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. సోమవారం రాఖీ పౌర్ణమి పండుగను జరుపుకొనేందుకు సర్వం సిద్ధం చేశారు.

– సంగారెడ్డి జోన్

8లో

ప్రయాణికులు ఫుల్.. ఆదాయం నిల్

మహాలక్ష్మితో ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీ

- ఆదాయం మాత్రం అంతంతే..
- సిబ్బందిపై పెరుగుతున్న ఒత్తిడి
- డబుల్ డ్యూటీలతో అనారోగ్యం
- బస్సులకు తరచూ రిపేర్లు

రాష్ట్ర ప్రభుత్వం 'మహాలక్ష్మి' పథకం ప్రారంభించినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఎలాంటి రుసుం చెల్లించకుండా రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత ప్రయాణం కొనసాగించే అవకాశం కల్పించింది. బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగినప్పటికీ.. ఆర్టీసీకి ఆదాయం తగ్గింది. అంతేకాకుండా డబుల్ డ్యూటీల కారణంగా ఆర్టీసీ సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ట్రిప్పుల సంఖ్య పెరగడంతో బస్సులకు తరచూ రిపేర్లు అవుతున్నాయి.

నారాయణఖేడ్:



నారాయణఖేడ్: బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

మెదక్ రీజియన్ పరిధిలో నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్– ప్రజ్ఞాపూర్ డిపోలు ఉన్నాయి. ఈ 8 డిపోల్లో 593 బస్సు సర్వీసులు ఉండగా అందులో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 147, పల్లెవెలుగు 389, లగ్జరీ, సూపర్‌లగ్జరీ బస్సులు 57 కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఈ బస్సుల్లో సగటున 2.40లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో 1.50లక్షల మంది మహిళలే కావడం గమనార్హం. మహిళలకు ఉచిత ప్రయాణం హామీ అమలుకు ముందు నిత్యం సగటున ప్రయాణికులు 1.70లక్షలు మాత్రమే ప్రయాణించేవారు. 8 డిపోల పరిధిలోని బస్సులు నిత్యం 2.05 లక్షల కిలోమీటర్ల మేర నడిపించేవారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకానికి ముందు నిత్యం ఆదాయం రూ.94.55లక్షలు. ఇప్పుడు రూ.1.29కోట్లకు చేరింది. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) గతంలో 74.09 ఉండగా ఇప్పుడది 105.92కి పెరిగింది. అయితే బస్సుల్లో టికెట్ల ద్వారా వచ్చే నగదు తగ్గిపోయింది. కేవలం ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్‌మెంట్ పెరిగింది.

ఎనిమిది డిపోల పరిధితో మహాలక్ష్మి ప్రారంభం నుంచి రేషియో (రూ.లక్షలలో..)

నెల	మహాలక్ష్మి	ఫేయిర్	మొత్తం
డిసెంబర్ 2023	27.45	23.45	50.90
జనవరి 2024	51.06	29.33	80.39
ఫిబ్రవరి	53.30	26.68	79.98
మార్చి	55.61	27.83	83.44
ఏప్రిల్	52.67	28.18	80.55
మే	54.41	30.47	84.88
జూన్	55.33	29.45	84.78
జులై	56.25	28.47	84.73
13 ఆగస్టు వరకు	25.56	12.29	37.85

ఆర్టీసీ సిబ్బందిపై పెరిగిన పని ఒత్తిడి

బస్సుల్లో రద్దీ పెరగడంతో ట్రిప్పుల సంఖ్య కూడా పెంచారు. దీంతో ఆర్టీసీ సిబ్బందికి డబుల్ డ్యూటీలు, ఓవర్ డ్యూటీలు చేయాల్సి వస్తుంది. ఇందుకనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో వారిపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. అంతేకాకుండా కొందరు అనారోగ్యాల పాలవుతున్నారు.

ఇవీ నిత్య కష్టాలు..

ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా సర్వీసులు, కార్మికుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం సైతం సంస్థ మనుగడకు వెనువెంటనే రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కార్మికుల వర్గం కోరుతుంది.

- కార్మికులు పదవీ విరమణ పొందుతున్నా నూతన రిక్రూట్‌మెంట్లు ఉండటం లేదు. సర్వీసుల సంఖ్య కూడా రద్దీకి అనుగుణంగా పెంచాలి.
- బస్సుల సమయపాలన జరగడంలేదు. ప్రతీ సర్వీసు 1.30గంటల నుంచి రెండు గంటల ఆలస్యం అవుతుంది.
- ఉన్న సిబ్బందితోనే సర్వీసులు క్యాన్సిలేషన్ కాకుండా డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారు.
- కేఎంపీఎల్ రావాలంటూ సంస్థ అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. ఈ విషయంలో నిత్యం కౌన్సెలింగ్ తప్పడంలేదు.
- అలా కేఎంపీఎల్ రానిపక్షంలో హకీంపేట్‌లోని జోనల్ స్టాఫ్ ట్రెయినింగ్ కాలేజీకి పంపుతామంటూ బెదిరింపులు.
- కండక్టర్లకు మహాలక్ష్మి టికెట్లు పోను ఎర్నింగ్స్ తేవాలంటూ నిత్యం టార్గెట్లు నిర్ధారణ జరుగుతుంది.
- ఓవర్‌లోడ్ వల్ల బస్సులు తరచూ రిపేర్లకు వస్తున్నాయి.

నగదు రాక తగ్గింది..



నారాయణఖేడ్ నుంచి వయా రేగోడ్, సింగూరు, సదాశివపేటకు సర్వీసు నడిపిస్తా. గతంలో నిత్యం రూ.8వేల నుంచి 10వేల వరకు ఆదాయం సమకూరేది. ఇప్పుడు రూ.5వేల వరకే మాత్రమే వస్తుంది.

– పిట్ల రవీందర్, కండక్టర్

తరచూ బస్సు ఆపాలంటే ఇబ్బందే



మహిళలు ఎక్కడపడితే అక్కడ బస్సులు ఆపుతున్నారు. దీంతో కేఎంపీఎల్ ఎలా వస్తుంది?. ఆపని పక్షంలో బైక్‌లపై బస్సును వెంబడించి వచ్చి బెదిరిస్తున్నారు.

– బి.వీరయ్య, డ్రైవర్

బస్సుల సంఖ్య పెరగాలి



మహాలక్ష్మి పథకం నుంచి మహిళల ప్రయాణ సంఖ్య పెరిగింది. అందుకు అనుగుణంగా బస్సులు, కార్మికుల సంఖ్య పెరగాలి. ఖేడ్ డిపోలో 400మంది కార్మికులుండాలి. కానీ 250మంది ఉన్నారు.

– పాండు, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి

న్యాల్‌కల్‌లో పారా మెడికల్ కాలేజీ

ఏర్పాటు బాధ్యత నాదే : మంత్రి దామోదర



మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

న్యాల్‌కల్(జహీరాబాద్) : న్యాల్‌కల్ ప్రాంతంలో పారా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసే బాధ్యత తనదేనని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండల పరిధిలోని పంచవటి క్షేత్రం ఆవరణలో నిర్మించిన 75 పడకల శ్రీకాశీనాథ్ బాబా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. న్యాల్‌కల్, ఖేడ్, మనూర్, రేగోడ్ ప్రాంతంలో పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంటర్‌నేషనల్ స్కూల్‌ను తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తుందన్నారు. అలాగే ప్రతీ నియోజకవర్గానికి ఒక నర్సింగ్ కళాశాలను, జిల్లాకు పారా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సంగారెడ్డిలో రూ.250 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతున్న సమయంలో.. మా ఆస్పత్రికి ఒక అంబులెన్స్ కావాలని ఓ భక్తుడు కోరారు. స్పందించిన మంత్రి రెండు రోజుల్లో పంపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, పంచవటి క్షేత్రం పీఠాధిపతి కాశీనాథ్‌బాబా, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి, టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాంకాల్ సుభాష్ పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు : నియోజకవర్గంలోని రహదారుల విస్తరణ, మరమ్మతు పనులకు నిధులు కేటాయించాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వరకు ఉన్న డబుల్ లేన్ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించాలని.. ఇందుకోసం రూ.70 కోట్లు కేటాయించాలని, కిష్టారెడ్డిపేట నుంచి దౌల్తాబాద్ వయా రామేశ్వరబండ రోడ్డును సింగిల్ లేన్‌ను డబుల్ లేన్లుగా విస్తరించేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే పటాన్‌చెరు నుంచి మల్కాపూర్ రోడ్డు రిపేర్లకు రూ.5.25 కోట్లు కేటాయించాలని, బీహెచ్ఈఎల్ మెయిన్ గేటు నుంచి ఎన్‌హెచ్–9 వయా వెలిమెల రోడ్డు రిపేర్లకు రూ.2.1 కోట్లు, గుమ్మడిదల నుంచి నూతనకల్ వయా కనుకుంట రోడ్డు విస్తరణకు రూ.6.82 కోట్లు, శివనగర్ నుంచి కంజర్ల రోడ్డు విస్తరణకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్: పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో వచ్చే నెల 4వ తేదీ నుంచి నెలరోజుల పాటు గ్రామీణ మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన మహిళలు (18 నుంచి 45 ఏళ్లలోపు) అర్హులని చెప్పారు. శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు మగ్గం వర్క్ టూల్ కిట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, ఎస్ ఎస్‌సీ మెమో జిరాక్సులు, నాలుగు పాస్ ఫొటోలు, బ్యాంక్ పాస్‌బుక్‌ను వచ్చే నెల 3వ తేదీలోపు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ఇవ్వాలని సూచించారు. ఇతర వివరాలకు 97044 46956, 94901 29839 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏపీకే ఫైల్స్ ముసుగులో సైబర్ మోసాలు

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఏపీకే ఫైల్స్ ముసుగులో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి ఆదివారం హెచ్చరించారు. ట్రెండింగ్ టాపిక్‌తో ఏపీకే ఫైల్ బ్యాంకు మెసేజ్‌ల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఎప్పటికప్పుడు వారి వ్యూహాలను మారుస్తూ ప్రజల నుంచి నగదును కాజేస్తున్నారన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు, ఫోన్ కాల్స్ స్పందించి ఓటీపీలు చెప్పకూడదన్నారు. బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని వచ్చే ఫోన్ కాల్స్‌ను గుడ్డిగా నమ్మి వివరాలను చెప్పొద్దన్నారు. వాట్సాప్ గ్రూపులో ఏపీకే ఫైల్స్ తో లింక్స్ వస్తే ఎట్టి పరిస్థితి క్లిక్ చేయకూడదన్నారు.

సాక్షి ఫొటో జర్నలిస్ట్ శివప్రసాద్‌కు రెండు రాష్ట్రస్థాయి అవార్డులు



ఫొటోగ్రాఫర్ శివప్రసాద్

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలలో సంగారెడ్డి జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బి.శివప్రసాద్‌కు రెండు అవార్డులు దక్కాయి. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ఒకటి, తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మరొకటి వచ్చాయి. నేడు రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా సికింద్రాబాద్‌లోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో అవార్డు అందుకోనున్నారు.



తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో అవార్డు గెలుపొందిన ఫొటో

కార్మికులకు అండగా ఉంటా..

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు రాములు నాయక్ అన్నారు. ఆదివారం పాశమైలారం మార్కెట్ గ్రౌండ్‌లో సువిన్ ఫార్మా పరిశ్రమ కార్మికులు నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సువిన్ ఫార్మాలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, డిమాండ్లు పరిష్కరించాలని నిరసన చేపడుతున్న విషయం తెలుసుకొని, పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడడంతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అదేవిధంగా కార్మికులు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కూడా ఆశ్రయించి తమ సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని కోరినట్లు గుర్తు చేశారు. ఇటీవలే సువిన్ ఫార్మా యజమాన్యం కార్మికులను పర్మనెంట్ చేసేందుకు మూడు నెలల గడువు ఇవ్వాలని జిల్లా లేబర్ కార్యాలయంలో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కేకేసీ రాష్ట్ర అధ్యక్షుడు కౌశిక్, ఏఆర్ రెహమాన్, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాములు నాయక్

జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా సాయితేజ, కోశాధికారిగా ప్రశాంత్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా జాన్ పాల్, సోమశేఖర్, ఉపాధ్యక్షులుగా శ్రీధర్, మొగులయ్య, గౌసుద్దీన్, మహేష్ చారి సంయుక్త కార్యదర్శిగా తోట జగన్మోహన్, చంద్రారెడ్డి, దియాకత్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రఘునందన్, రమేష్, తిరుమలరావు హెల్త్ కమిటీ కన్వీనర్ గా డాక్టర్ వెంకటేష్ ఎన్విరాన్మెంటల్ సబ్ కమిటీ కన్వీనర్ ప్రతాప్,సమత కమిటీ కన్వీనర్ గా లక్ష్మి,అన్నపూర్ణలను విద్యా కమిటీ కన్వీనర్ గా చంద్రమోహన్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వెంకటేశ్వర్ రావు హాజరయ్యారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసి 11 ఏళ్లు అయినా ఇప్పటివరకు బదిలీలు చేపట్టకపోవడం సరికాదన్నారు. 010 పద్దు కింద వేతనాలను చెల్లించడంతో పాటు ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. రెండవ దఫా నియామకం అయిన ఉపాధ్యాయులకు నోషనల్ సీనియారిటీ వర్తింపజేయాలని, రాష్ట్రంలో 40 మంది ఉపాధ్యాయులు మరణించారని, వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. కేంద్రీయ విద్యాలయాల తరహాలో బోధనతోపాటు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్ మ్యూజిక్ వంటి కోకరిక్యులర్ విభాగాల్లో కూడా ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని కోరారు. బదిలీలు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదీన శాంతియుతంగా ఇందిరాపార్క్ లో ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, ఎంఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా కోశాధికారి శ్రీనివాస్ రావు, టీఎస్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ప్రభాకర్, రవీందర్, సంగమేశ్వర్, సందీప్, తార్య నాయక్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులు పట్టి.. న్యాయం కోసం కదిలి



జహీరాబాద్‌లో నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

జహీరాబాద్ టౌన్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యం అత్యంత దారుణమని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం (టీబెస్) నాయకులు ఆదివారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్ మాట్లాడుతూ.. పేదలకు వైద్య సేవలు అందించే డాక్టర్లకు భద్రతలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తుకారాం చవాన్, హన్మంత్ పవార్, అర్జున్ చవాన్, హీరు రాథోడ్, శ్రీనివాస్, దేవిసింగ్ రాథోడ్, హీరాలాల్ చవాన్ పాల్గొన్నారు.

వర్షం.. రహదారులు జలమయం



సంగారెడ్డి పట్టణంలోని రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

సంగారెడ్డి టౌన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. చిన్నపాటి వానకే పట్టణ ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. సంగారెడ్డి చౌరస్తా ప్రాంతంలో జీన్స్ కార్నర్ ఎదుట రోడ్డుపై మోకాలు లోతు నీరు చేరింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో కాలనీల్లోని రోడ్లపై మురుగు పారింది. చిన్నపాటి వర్షానికే పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

కన్న కొడుకే కాలయముడై..

- భూమి అమ్మేందుకు అడ్డు వస్తున్నాడని మట్టుబెట్టాడు


నిందితుడు అశోక్‌రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): భూమిని అమ్మేందుకు తండ్రి అడ్డు వస్తున్నాడని కొడుకు దారుణంగా కొట్టి చంపిన ఘటన సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ చంద్రయ్య కథనం మేరకు.. మండలంలోని మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన పడమటి అశోక్‌రెడ్డి జల్సాలకు అలవాటు పడి మద్యానికి బానిసయ్యాడు. తండ్రి మాధవరెడ్డి(57) ఉన్న ఎకరా పొలంలో పంట పండిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజులుగా పొలాన్ని అమ్మి డబ్బులు ఇవ్వాలని అశోక్‌రెడ్డి తండ్రిని వేధిస్తున్నాడు. దీనికి అతడు నిరాకరించాడు. తండ్రిపై కక్ష్య పెంచుకున్న కొడుకు ఈ నెల 16వ తేదీన (శుక్రవారం) రాత్రి దారుణంగా కొట్టి హత్య చేశాడు. అడ్డుగా వచ్చిన తల్లి పద్మను విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా అశోక్ రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. ఆదివారం జ్యుడిషల్ రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి

- పొలం ఫెన్సింగ్ వైరే మృత్యుపాశమై..


పొలంలో యాదగిరి మృతదేహం

వర్గల్(గజ్వేల్): పొలానికి వేసిన ఫెన్సింగ్ వైరే ఆ రైతు పాలిట మృత్యుపాశమైంది. విద్యుదాఘాతం యువరైతును కబలించిన ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి, మృతుడి కుటుంబీకుల కథనం మేరకు.. మీనాజీపేటకు చెందిన నీల యాదగిరి(30), లావణ్య దంపతులకు ఆరేళ్లలోపు హర్షిత్, సిద్విక్, టోనీ ఉన్నారు. కొద్దిపాటి వ్యవసాయం చేసుకుంటూనే యాదగిరి పెట్రోల్‌బంకులో, లావణ్య సమీప విత్తన పరిశ్రమలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగేళ్ల కిందట తండ్రి దశరథ మృతి చెందగా తల్లి భూమవ్వ కొడుకు యాదగిరి వద్దే ఉంటుంది. శనివారం వ్యవసాయ పొలానికి వెళ్లిన యాదగిరి బోరుకు విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ వైరు, ఫెన్సింగ్ వైరుకు తగిలి కరెంట్ సరఫరా అవుతున్న విషయం గమనించలేదు. పొలం చుట్టూ తిరుగుతున్న క్రమంలో ఫెన్సింగ్ తీగలు తగిలి విద్యుత్‌షాక్‌తో పడిపోయాడు. పరిశ్రమలో డ్యూటీకి వెళ్లి తిరిగొచ్చిన భార్యకు ఇంట్లో యాదగిరి కనిపించలేదు. ఆందోళనకు గురై వెతుకుతుండగా రాత్రి పొలం వద్ద యాదగిరి మృతిచెంది కనిపించాడు. ఆదివారం గజ్వేల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య

సిద్దిపేటరూరల్: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నారాయణరావుపేట మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ అపూర్వరెడ్డి కథనం మేరకు.. లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన అరుణ్(23) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుకుంటున్నాడు. ఈ నెల 14వ తేదీన ఇంటికొచ్చిన అరుణ్ తల్లిదండ్రులు రవీందర్, దేవవ్వలతో సరిగా మాట్లాడలేదు. శనివారం తల్లిదండ్రులు పనుల నిమిత్తం సిద్దిపేటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికొచ్చేసరికి తాళం వేసి ఉంది. ఇంటి వెనుకాల తలుపులో నుంచి చూడగా దూలానికి చీరతో ఉరి వేసుకొని కనిపించాడు. కుమారుడి ఆత్మహత్యపై అతడి స్నేహితులు ముగ్గురిపై అనుమానం ఉందని, వారిని విచారించి తగు చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి రవిందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధుడు

సిద్దిపేటకమాన్: కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన దెశెట్టి అయిలయ్య (72) నాలుగు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులోని చింత చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుబంధాల రాఖీ

- నేడు రాఖీ పౌర్ణమి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- మార్కెట్‌లో తీరొక్క రకాలు



అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. తమ తోబుట్టువులు సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలంటూ ఎక్కడ ఉన్నా తమ ఇంటికి వచ్చి సోదరులకు రాఖీలు కడుతారు. ఒక వేళ వారు అందుబాటులో లేకున్నా కొరియర్, పోస్ట్‌ల ద్వారా తమ సోదరులకు రాఖీలు పంపిస్తారు. అలాంటి విశిష్ట విలువలు కల్గిన పండుగ రాఖీ. కష్ట సుఖాల్లో, సుఖ సంతోషాల్లో మేము ఉన్నామనే భరోసాను అక్కాచెల్లెళ్లకు కల్పించడమే ఈ పండుగ బంధం. నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకోనున్నారు.

ఆకట్టుకునే డిజైన్లు


ఖేడ్ పట్టణంలో రాఖీ విక్రయాల వద్ద సందడి

నారాయణఖేడ్: రాఖీ పండుగను చిన్నారులు, వయో వృద్ధులు మొదలుకొని కుల, మత ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ వేడుండగా చేసుకుంటారు. పిల్లలకు రాఖీ పండగ అంటే మరీ సరదా. సంప్రదాయంగా వచ్చే రాఖీలకు మాత్రం గిరాకీ ఇంకా తగ్గలేదు. కాటన్ దారంతో తయారైన రాఖీలు చేతికి అందంగా కన్పిస్తాయి. వీటిని ఎక్కువగా ఆర్‌ఎస్‌ఎస్ వారు, పంతుళ్లు, పలు సంస్థల వారు ఉచితంగా పంపిణీ చేస్తారు. ఇవి మార్కెట్లో కేవలం రూ.2 నుంచి రూ.5 మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

తోబుట్టువుల మధ్య ప్రేమానురాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : అన్నాతమ్ముళ్ల రక్షణ, శ్రేయస్సు కోరి అక్కా, చెల్లెల్లు కట్టే రాఖీ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకుంటాం. మా అక్క స్వప్న ప్రతీ పండుగకు ఇంటికొచ్చి రాఖీ కడుతారు. మా సొంతూరు హసన్‌పర్తి (వరంగల్ జిల్లా). హైదరాబాద్‌లో నివాసముండే అక్క ఇంటికి వచ్చి రాఖీ కడుతారు. నాతోపాటు మానాన్న రమణయ్యకు కూడా కడుతారు. చిన్నప్పటి నుంచి ఈ పండుగను సెలబ్రేట్ చేసుకుంటున్నాం తమ సోదరుల ఉన్నతిని కోరుకుంటూ అక్కలు దీవిస్తుంటారు. తోబుట్టువుల మధ్య ప్రేమానురాగాలు మరింత పెరిగేందుకు ఇలాంటి పండగలు ఎంతో దోహదం చేస్తుంటాయి.

కులం, మతంతో సంబంధం లేదు


నాగరాజుకు రాఖీ కడుతున్న షహిన్ బేగం(ఫైల్)

జహీరాబాద్ టౌన్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి కులం మతం, రక్త సంబంధం అవసరం లేదని నిరూపిస్తుంది ముస్లిం సోదరి. జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన జూనియర్ అసిస్టెంట్ నాగరాజును సొంత అన్నలా భావించి ప్రతీ సంవత్సరం రాఖీ కడుతుంది. పదేళ్లుగా తప్పకుండా పండుగ రోజు ఇంటికొచ్చి రాఖీ కట్టి ఆశీర్వదిస్తుంది. బాగారెడ్డిపల్లికి చెందిన నాగరాజ్ శాంతినగర్‌కు చెందిన ఎండీ కుద్దూస్‌లు మంచి మిత్రులు. క్లాస్‌మెంట్‌లు కూడా కావడంతో ఒకరి ఇంటికి మరొకరు వస్తూ పోతుండటంతో ఇరువురి మధ్య కుటుంబం బంధం ఏర్పడింది. అనుకోకుండా కుద్దూస్ చనిపోగా ఆయన సోదరి షహిన్‌బేగం నాగరాజను సొంత అన్నలా చూసుకుంటుంది. ప్రతీ సంవత్సరం రాఖీ పౌర్ణమి పండుగ రోజు ఇంటికి వచ్చి నాగరాజుకు రాఖీ కడుతుంది. ఆమె వివాహమై హైదరాబాద్‌లో స్థిరపడినా కూడా రాఖీ పౌర్ణమి రోజు జహీరాబాద్‌కు వచ్చి నాగరాజ్‌కు రాఖీ కట్టి వెళ్తుంది.

తమ్ముడికి అక్కల రక్ష


హెల్మెట్ అందజేస్తున్న అక్కలు

దుబ్బాక : ప్రతీ ఏటా రాఖీ పౌర్ణమికి సుదూర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ఐదుగురు అక్కలు తప్పకుండా తమ్ముడికి రాఖీలు కట్టేందుకు వచ్చి ప్రత్యేకంగా గిఫ్టులతోపాటు దీవెనలు ఇస్తున్నారు. దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన పరశురాములుగౌడ్‌కు ఐదుగురు అక్కలు.. పెళ్లీలు అయ్యి ఎక్కడెక్కడో వారి పిల్లలతో స్థిరపడ్డారు. రాఖీ పౌర్ణమికి మాత్రం తమ్ముడికి రాఖీ కట్టేందుకు వస్తారు. తమ్ముడు చల్లగా ఉండాలంటూ దీవెనలు ఇవ్వడంతో పాటు హెల్మెట్ గిఫ్టులను ఇస్తున్నారు. ఎన్ని పనులు ఉన్నా తప్పకుండా తమ్ముడికి రాఖీలు కట్టేందుకు మా అక్కలు వస్తారని ఇప్పటికే చాలా గిఫ్టులు ఇచ్చారని పరుశరాములుగౌడ్ రాఖీ పండుగతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నాడు.

అమెరికా నుంచి రాఖీలు



అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతిరూపమే రాఖీ అని పానుగంటి శ్రీలత అన్నారు. మా పుట్టిల్లు చిన్నకోడూరు గ్రామం. ముగ్గురు సోదరులకు నేను ఒక్క చెల్లెను. వివాహం జరగడంతో భర్త, పిల్లలతో కలిసి అమెరికాలో స్థిరపడ్డాం. చిన్నప్పటి నుంచి ముగ్గురు సోదరులకు రాఖీ కట్టి అన్నా చెల్లెల అనుబంధాన్ని పంచుకుంటా. 16 ఏళ్లుగా అమెరికాలో ఉన్నా ప్రతీ రాఖీ పౌర్ణమికి ముగ్గురు సోదరులకు రాఖీలు పంపుతాను.

– చిన్నకోడూరు(సిద్దిపేట)

ప్రత్యేక బస్సులు



ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ప్రభులత

సంగారెడ్డిటౌన్: రాఖీ పండుగ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. పండుగను పురస్కరించుకొని అన్నా తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు మహిళలు రాకపోకలు సాగిస్తుంటారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా మహాలక్ష్మి పేరిట ప్రయాణ సౌకర్యం కల్పిస్తుంది. అదనంగా 265 బస్సులు నడుపుతామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మా ఇంట్లో రాఖీ పెద్ద పండుగ



ప్రతీ సంవత్సరం రాఖీ పండుగ మా ఇంట్లో పెద్ద సందడిగా చేసుకుంటాం. నాకు ముగ్గురు అక్కలు, ఇద్దరు చెల్లెళ్లు. ప్రతీ ఏటా రాఖీ పౌర్ణమికి తప్పకుండా ఇంటికొచ్చి నాకు రాఖీలు కట్టి ఆశీర్వదిస్తారు. రాఖీ పండుగ ఎప్పుడు వస్తుందా అని ప్రతీసారి ఎదురు చూస్తుంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేశ్ గౌడ్ తన అనుబంధాన్ని సాక్షితో పంచుకున్నాడు.

–అంబటి బాలేశ్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు


మెరుపుల రాఖీలు

రాఖీల హబ్ 'సిద్దిపేట'

- ఎనిమిది రాష్ట్రాలకు సరఫరా
- ధర రూ.1 నుంచి రూ.10 వేల వరకు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాఖీల తయారీకి సిద్దిపేట అడ్డగా నిలుస్తుంది. ఇక్కడి వ్యాపారస్తులు రాఖీలను నచ్చిన విధంగా తయారు చేయిస్తున్నారు. దీంతో ఇక్కడి ప్రజలకు జీవనోపాధితో పాటుగా, వ్యాపారం కొనసాగుతుంది. ఆరు నెలల ముందు నుంచే రాఖీల తయారీ కొనసాగుతుంది. జిల్లాలో 10 వరకు రాఖీ తయారీ, హోల్‌సెల్ విక్రయ కేంద్రాలు ఉన్నాయి. అదే విధంగా 1,000 వరకు రీటైల్ రాఖీ విక్రయ కేంద్రాలు ఉన్నాయి. తయారీలో పర్యావరణానికి హాని చేయని పదార్థాలు వాడుతుంటారు. సిద్దిపేట రాఖీలకు ఇతర రాష్ట్రాల్లో సైతం డిమాండ్ పెరుగుతుంది.


కొరియర్, స్పీడ్ పోస్ట్‌ల ద్వారా..

ఈ రాఖీల తయారీకి సిద్దిపేట అడ్డగా నిలుస్తుంది. సిద్దిపేటలో తయారయ్యే రాఖీలు దేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు సరఫరా అవుతున్నాయి. తెలంగాణతోపాటుగా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, గోవా, ఒరిస్సాలకు సరఫరా చేస్తున్నారు. ఆర్డర్‌లను బట్టి మరిన్ని రాష్ట్రాలకు ఈ రాఖీల సరఫరా చేస్తున్నారు. అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల్లో ఉన్న ప్రవాస భారతీయులు కూడా తమ మిత్రులతో కొరియర్, స్పీడ్ పోస్ట్‌ల ద్వారా రాఖీలను ఖరీదు చేస్తున్నారు.

భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా

ఈ రాఖీల తయారీలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా తయారు చేస్తున్నారు. భగవద్గీత రాఖీ, మీనాకారీ రాఖీ, పూజా, తాళీ, సీజెడ్, ఈడీ రాఖీ, బంగారు, సిల్వర్ రాఖీ, కాఫర్, పాఠశాల, పర్యావరణం వంటి రాఖీలు, తదితర అంశాలను స్ఫూర్తించే విధంగా తయారు చేస్తూ విక్రయిస్తున్నారు.


శ్రీరాముడి రాఖీ


చిల్డ్రన్ రాఖీ

దేశంలోనే గుర్తింపు

సిద్దిపేటలో తయారయ్యే రాఖీలకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. రాఖీ అంటేనే సోదారాభావం పెంపొందించి, బంధుత్వాన్ని పటిష్టం చేసే పండుగ. అందువల్ల రాఖీల తయారీలో భారతీయత ఉట్టి పడుతుంది. వీటితోపాటుగా పర్యావరణం, పాఠశాలలు, భగవద్గీత, దేవతల, వివిధ ప్రయోగాలకు సంబంధించిన రాఖీలను తయారు చేస్తున్నాం. రూ.1 నుంచి రూ.10 వేల విలువ గల రాఖీలను సిద్దిపేటలో తయారీ చేసి విక్రయిస్తున్నాం.

– ఛీకోటి మధు, విజయలక్ష్మి రాఖీ సెంటర్, సిద్దిపేట

చిత్రం.. చెదరని జ్ఞాపకం

ప్రతీ క్షణాన్ని ఓ మధుర జ్ఞాపకంగా , ఎన్నో విలువైన రూపాలను ఎప్పటికీ సజీవంగా నిలిపేది ఓ ఫొటో మాత్రమే. అలనాటి జ్ఞాపకాన్ని మళ్లీ మళ్లీ తనివితీరా వీక్షించే అవకాశాన్ని ఇచ్చే తీపి గుర్తు. కాలం గిర్రున తిరుతున్నప్పటికీ ఫొటో చూడగానే వెనక్కి వెళ్లి ఏళ్ల కిందటి మధుర స్మృతులు మదిలో గుర్తొస్తాయి. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..


ప్రకృతిలో ఒదిగిపోయి


మకరందం వేటలో..



గిజిగాళ్ల కిచకిచలు


ప్రకృతిలో ఒదిగిపోయి


రేడియోతో..


ప్రకృతి మంచు తెర

- మిరుదొడ్డి(దుబ్బాక)


దూరసంగం గ్రామ శివారులో సాయంత్రం సమయంలో ఎరుపెక్కిన ఆకాశం


పొట్టి పల్లి గ్రామ శివారులో గిజిగాడు గూళ్లు

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి


అందంగా నాందేడ్ అకోలా జాతీయ రహదారి


సంగారెడ్డి గుడి తండాలో బియ్యం చేస్తున్న గిరిజన మహిళ


పెద్ద శంకరం పేట శివారులో..


సీతాకోక చిలుక


మామిడి తోటలో నెమలి


పచ్చని పొలాల్లో మోడువారిన చెట్టు


ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట


పచ్చని పొదరిల్లులా పల్లె


కోమటిచెరువు ట్యాంక్‌పై ఉషోదయ కిరణాలు


రూణమాఫీ ఆనందంలో రైతన్నలు


బోనాల వెలుగులు


రమణీయంగా రంగనాయకం


గిరిజన పిల్లలు

అద్భుతాల శివ..


- పేద చేనేత కార్మిక కుటుంబం నుంచి కెమెరా వైపు
- గిరిజనుల బతుకు చిత్రాల ఫొటోలకు ప్రశంసలు

దుబ్బాక : నమ్ముకున్న కులవృత్తిలో ఆదరణ కరువై కడు దుర్భర పరిస్థితుల్లో బతుకు బండి లాగిస్తున్న పేద చేనేత కార్మిక కుటుంబం దుబ్బాక పట్టణానికి చెందిన మచ్చ శివకుమార్‌కు చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీ అంటే చాలా మక్కువ. ఫొటోలు తీయడంలో ఎప్పుడు కొత్తదనం వెతుక్కుంటాడు. కెమెరా భుజాన వేసుకొని బండి మీద చక్కర్లు కొడుతూ ఏదైనా కొత్తగా వింతగా కనిపిస్తే కెమెరాతో క్లిక్ మనిపించడం అతడి హాబీ.. ఆధునిక ప్రపంచంలో సైతం తన కెమెరాతో అద్భుతాలు తీస్తున్నాడు.

గిరిజనుల బతుకు అద్దంపట్టేలా..

25 ఏళ్లుగా ఫొటోగ్రాఫర్‌గా ఉన్న శివ ఎన్నో అద్భుతమైన చిత్రాలు తీసి ఔరా అనిపించుకున్నాడు. ముఖ్యంగా సామాజిక నేపథ్యం గల శివ సమాజంలో కడు దయనీయమైన పరిస్థితుల్లో కాలం వెళ్లదీస్తున్న గిరిజనులు, పేదల బతుకు చిత్రాలను కళ్లకు అద్దం పట్టే విధంగా తీసి ప్రముఖులతో ప్రశంసలు అందుకున్నాడు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కెమెరా అంటే నాకు ప్రాణం. 25 ఏళ్లుగా దానితోనే నా ప్రయాణం. పానాసోనిక్ కెమెరా అంటే ఇష్టం. పెండ్లీలు, శుభ కార్యాలు, ఉత్సవాల్లో ఫొటోలు, వీడియో తీస్తూ జీవనం కొనసాగిస్తున్నాం ..సెల్ ఫోన్లు రావడంతో ఫొటోగ్రాఫర్ల పరిస్థితి ఏ మాత్రం బాగా లేదు.. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లకు ప్రత్యేక రుణాలు ఇచ్చి ఆదుకోవాలి. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఎన్నో ప్రయోగాలు.. అద్భుతాలు చేద్దామన్నా చేయలేకపోతున్నా.

– శివ, ఫొటోగ్రాఫర్